క్లుప్తంగా

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా కళ్లుతెరిచి యువతకు పూర్తి న్యాయం జరిగేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు యువతను చేసిన మోసంపై వైఎస్సార్ సీపీ యువజన విభాగం చేపట్టిన యువత పోరు కార్యక్రమం పూర్తి విజయవంతమైందని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు యువతకు ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కి కేవలం వారి ఎదుగుదల కోసమే అధికారాన్ని వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కనులపండువగా శివయ్యకు రుద్రాభిషేకం



శివయ్యకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను వైభవంగా జరిపారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, పండితులు శివదేవునికి వేద మంత్రోచ్ఛరణలతో రుద్రాభిషేకాన్ని జరిపి, హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాత్రి స్వామివారికి జరగాల్సిన గ్రామోత్సవం ప్రతికూల వాతావరణం కారణంగా రద్దయ్యింది.

సమస్యల పరిష్కారంపై హర్షం



అభిషేక్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బొర్రంపాలెం ఎంఆర్‌సీ కాలనీవాసులు

టి.నరసాపురం: సమస్యల పరిష్కారంపై బొర్రంపాలెం ఎంఆర్‌సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలోని తాగునీరు, విద్యుత్ సౌకర్యం సమస్యలపై స్థానిక నాయకులు, సర్పంచ్, కార్యదర్శులకు విన్నవించుకున్నామని కాలనీవాసులు తెలిపారు. నాలుగు రోజులు క్రితం తమ సమస్యలను స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్ బాబుకు తెలపగా ఆయన స్పందించి, సొంత నిధులతో అవసరమైన ఏర్పాట్లు చేశారన్నారు. తమ దాహార్తిని తీర్చిన పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు అభిషేక్‌బాబుకు ఎంఆర్‌సీ కాలనీవాసులు బత్తుల రమేష్, కొనకళ్ల సర్వేశ్వరరావు, పల్లా రమేష్, రాజబోయిన రమేష్, గుండె పాండురంగ, గుండె చిట్టియ్య తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



అంగాలగూడెంలో రోగులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఆమెన్ ట్రస్ట్ సభ్యులు

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామంలో సోమవారం నేత్ర సంబంధిత రోగులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా అందులో 36 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, స్వచ్ఛంద సేవకులు జీవీవీప్రసాద్ మాట్లాడుతూ ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకులు ఇవాంజలిన్ అశోక్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు కూనపాం రాజారత్నం, చాంద్ర చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పేరంపేటకు చెందిన బిళ్ల ద్వారకానాథ్‌రెడ్డి లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. 6 నెలల క్రితం పేరంపేటకు వచ్చి ఇంటి వద్ద నుంచే పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ ఉదయం సెల్‌ఫోన్ రిపేరు కోసం జంగారెడ్డిగూడెం వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో తల్లి బిళ్ల వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ద్వారకానాథ్‌రెడ్డికి వివాహమైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

వైద్యుల కొరత.. రోగుల వెత



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు

చింతలపూడి: కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆసుపత్రిలో కావలసినంత మంది డాక్టర్లను నియమించక పోవడం కారణంగా పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. పేరుకు 30 పడకల ఆసుపత్రి అయినా ఇక్కడ వైద్యుల కొరత రోగులను తీవ్రంగా బాధిస్తోంది. 23 మంది డాక్టర్లకుగాను ప్రస్తుతం 7గురు వైద్యులు మాత్రమే పని చేస్తున్నారు. అదే విధంగా గైనకాలజిస్ట్ పోస్టులు ఇక్కడ మూడు ఉన్నాయి. ఒక సివిల్ సర్జన్, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్‌లు ఉండాలి. సివిల్ సర్జన్ పోస్టు పల్నాడు నుంచి ఒక వైద్యురాలిని ఏడాది క్రితం నియమించారు. అప్పటి నుంచి ఆమె సెలవులో ఉన్నట్లు తెలిసింది. దీంతో గర్భిణులు, ప్రసూతి కోసం వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో కాన్పుకోసం వచ్చే గర్భిణులను ఏలూరు రిఫర్ చేస్తున్నారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి కూడా నిత్యం 250 నుంచి 300 మంది రోగులు వైద్యం నిమిత్తం వస్తుంటారు. రాఘవాపురం, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా 20 మంది రోగులకు పైగానే వస్తుంటారు. అలాగే జంగారెడ్డిగూడెం ఏరియ ఆసుపత్రికి కూడా 250 మంది వరకు వస్తుంటారని వైద్యులు తెలిపారు. డాక్టర్ల కొరత కారణంగా రోజూ ఇంత మంది రోగులను చూసే భారం ఉన్న డాక్టర్లపై పడుతోంది. ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలని అనేక సార్లు రోగులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి పూర్తయితేనే తప్ప డాక్టర్ల కొరతతో పాటు మందులు, సిబ్బంది కొరత కూడ తీరుతుందని అంటున్నారు.

గిరిజన గ్రామాల్లో పెరుగుతున్న జ్వరాలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో టైఫాయిడ్, మలేరియా కేసులు విజృంభిస్తున్నాయి. వీటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏజెన్సీ ప్రాంతంలోని 15 పీహెచ్‌సీల పరిధిలో మలేరియా, టైఫాయిడ్ కేసులతో బాధపడుతూ వైద్యం చేయించుకునే వారు అధికంగా కనిపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకూ 185 మలేరియా కేసులు నమోదైనట్లు చెబుతున్నప్పటికీ అనధికారికంగా వాటి సంఖ్య రెట్టింపు ఉండొచ్చని అంచనా. ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తున్నా మందులు అందుబాటులో లేకపోవడంపై ఇటీవల సాక్షి దినపత్రిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. దీనిపై స్పందించిన అధికారులు ప్రస్తుతం 2 వేల క్లోరోక్విన్ మాత్రలు స్టాక్ వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా రెండో విడత మలాథియన్ స్ప్రేయింగ్ పనులు కూడా ప్రారంభించినట్లు చెప్పారు.

దోమతెరల పంపిణీ కోసం ఎదురుచూపులు

గిరిజన మండలాల్లో సుమారు 158 గ్రామాలు మలేరియా సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో మలేరియా నివారణకు మలాథియన్ స్ప్రేయింగ్ పనులు చేయడంతోపాటు గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేశారు. 2021లో సుమారు 2 లక్షల 50 వేల దోమతెరలను పంపిణీ చేశారు. నాటి నుంచి నేటి వరకూ మళ్లీ దోమతెరలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. అయితే ఈ ఏడాది దోమతెరలు పంపిణీ చేసేలా ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు తెలిపారు. గతం కంటే ఈ ఏడాది మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నందున దోమతెరలు కూడా పంపిణీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం



వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల ప్రకారం అప్రమత్తంగా ఉన్నాం. వర్షాల వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున రోగులకు వైద్య సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆసుపత్రిలో జ్వరాలకు సంబంధించిన మందుల కొరతకూడా లేదు.

– బేబి కమల, జంగారెడ్డిగూడెం ఏరియ ఆసుపత్రి సూపరింటెండెంట్

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



గిరిజన గ్రామాల్లో మలేరియా టైఫాయిడ్ జ్వరాలు పెరుగుతున్నందున వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించేలా కృషి చేయాలి. అలాగే మలాథియన్ స్ప్రేయింగ్ పనులు కూడా అన్ని గ్రామాల్లో చేయించాలి.

– కారం రాఘవ, న్యూడెమోక్రసీ నాయకులు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

కుక్కునూరు నుంచి యువత పోరుకు



యువత పోరుకు తరలివెళుతున్న కుకునూరు మండల యువత

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకుండా యువత, విద్యార్థులను మోసం చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన యువత పోరు నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ ఆధ్వర్యంలో యువకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద విద్యార్థులు ఫీజుకి ఇబ్బంది పడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పలు హామీలతో యువకులను వంచిందన్నారు. నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లిన వారిలో చేకూరి నవీన్ వర్మ, సంతోష్ రెడ్డి, అనుగోజు సాయి, గంగాధర్ శ్రీనివాస్, సరియం వెంకటేష్, గంజి వెంకన్న బాబు, రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా మాజీ హోం మంత్రి వనిత జన్మదిన వేడుకలు



ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో కేక్ కట్ చేస్తున్న మాజీ హోం మంత్రి వనిత

ద్వారకాతిరుమల: రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పుట్టిన రోజు వేడుకలు ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో సోమవారం ఘనంగా జరిగాయి. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ముందస్తుగా నిర్వహించిన ఈ వేడుకల్లో వనిత పాల్గొని కేక్‌ను కట్‌చేసి పార్టీ శ్రేణులకు అందించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, గోపా నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పానమాల ఉమామహేశ్వరరావు, రుద్ర శివాజీ, షేక్ మస్తాన్ బాషా, దాసరి రాంబాబు, మల్లెపూడి నాగమణి, భోగరాజు సాయికృష్ణ, నాగాచారి, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, ఇమ్మడి పవన్‌కుమార్, వెజ్జు వేణు, షేక్ ఇస్మాయిల్, వామిశెట్టి ఆంజనేయులు, బుసనబోయిన వంశీ తదితరులున్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

జంగారెడ్డిగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ఆరోపించారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభ జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకి వేల్పుల మల్లప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో నడుస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. భూములన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతూ రైతు వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని, మండిపడ్డారు. రైతు వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చేల రంగారెడ్డి, జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అచ్యుత్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. ఈ సభలో ఐక్య రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్, ఏఐయుకేఎస్ రాష్ట్ర నాయకులు వై.ఆశీర్వాదం, సిరికొండ రామారావు, బాసిన సత్యనారాయణ, సోయం చంద్రావు, కట్టం ముత్యాలరావు, పి.శ్రీను, పిడబ్ల్యు నాయకులు ఎస్‌కే మున్ని, కట్ట వీరస్వామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామంతపూడి సూరిబాబు

టి.నరసాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్య నారాయణరాజు (సూరిబాబు) అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మీ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూరిబాబు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం దృష్ట్యా పంచాయితీ, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. దోమల మందు పిచికారి చేయించాలని, తాగునీటి పైపు లైన్‌ల లీకేజులు లేకుండా చూడాన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.నాగరాజకుమారి, చింతలపూడి మలేరియా వైద్యులు ప్రసాద్, ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయండి

పోలవరం రూరల్: ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జులై 7న ఘనంగా నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్ఎన్‌డీపేట, ప్రగడపల్లి గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ జెండా దిమ్మల నిర్మాణ భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా?



ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తినలక్ష్మి, కౌన్సిలర్‌లు, నేతలు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విస్మరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏ ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ప్రొటోకాల్ పాటించలేదన్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం బాలురు ఉన్నత పాఠశాల నందు జరిగిన పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ గాని, చైర్‌పర్సన్‌కు గాని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన వ్యక్తులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు భవిష్యత్తులో జరగకూడదని దీనికి సంబంధించిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్లు ఆర్డీవోను కోరారు.

పుంత దారి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పుంత దారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుర్వాయిగూడెం గ్రామస్తులు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 88, 89 మధ్య గత 50 సంవత్సరాలుగా పుంత రహదారి ఉందని, ఈ దారిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇటీవల ఆర్ఎస్ నెంబర్ 89లో కొందరు పుంత మార్గానికి కర్రలు అడ్డుగా కట్టి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌లో 10 అర్జీలు

పీజీఆర్ఎస్‌లో 10 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారని, అధికారులు చిత్తశుద్ధితో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సోమవారం నాటి అర్జీల్లో ఎక్కువగా భూ సంబంధిత, ఆర్అండ్ఆర్‌పై అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు.

దయనీయ స్థితిలో పొగాకు రైతులు

జంగారెడ్డిగూడెం: పొగాకు రైతులు దయనీయ స్థితికి నెట్టివేయబడుతున్నారని వర్జీనియా వేలం కేంద్రం రైతు సంఘం నాయకుడు వామిశెట్టి హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది వర్జీనియా పొగాకు కేజీ ఒక్కింటికి రూ. 410 ధర పలుకగా నేడు రూ.290కి కొనుగోలు చేయడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. అది కూడా గ్రేడ్-1 పొగాకు ఈ పరిస్థితిలో ఉండగా, మీడియం, లోగ్రేడ్ ధర మరింత దారుణంగా ఉందన్నారు. ఎకరానికి రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వాతావరణం సరిలేక అధిక స్థాయిలో లోగ్రేడు పొగాకు వచ్చిందన్నారు. 80 మిలియన్ల పొగాకు అవుతుందని బోర్డు వాళ్లు అంచనా వేశారని, అయితే ప్రస్తుత ధరలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి మార్క్ ఫెడ్ ద్వారా 15 మిలియన్ల పొగాకు కొనగలిగితే రైతులకి మంచి గిట్టుబాటు ధర వస్తుందని హరిబాబు అన్నారు. యోగా ఆంధ్ర కోసం ఒక్కరోజులోనే రూ. 350 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం, పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

తోటల్లోకి వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలి

టి.నరసాపురం: మండలంలోని రైతులు తమ తోటల్లోకి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే సమీప రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే టి.నరసాపురం ప్రాజెక్ట్ అధికారి సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే యాజమాన్యం తమను తోటల్లోకి కూడా వెళ్లకుండా లూప్ లైన్ కట్టడి చేసి, కందకాలు తవ్వడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు దారి ఇవ్వవలసిందిగా గ్రీన్ ఫీల్డ్ హైవే యాజమాన్యాన్ని రైతులు కోరారు. దీనిపై స్పందించిన ప్రాజెక్టు అధికారి సుధాకర్ తన పరిధి మేరకు రైతులకు రహదారి ఇబ్బందులు లేకుండా చూస్తానని, అవసరమైతే చిన్న చిన్న మరమ్మతులు నిర్వహించి, ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ హైవే సమీప రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాహనం ఏర్పాటు



ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి అంకాలగూడెం గ్రామస్తులు పార్టీలకు అతీతంగా కృషి చేస్తున్నారు. ఎంపీపీ స్కూల్ (మెయిన్) పాఠశాలకు విద్యార్థులను తీసుకువెళ్లడానికి సొంత ఖర్చులతో సోమవారం ఆటోను ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఆటోలో తీసుకువెళ్లడం, అదేవిధంగా తీసుకురావడం ద్వారా విద్యార్థుల హాజరు పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, మాజీ ఉపసర్పంచ్ గర్రే వీరభద్రరావు, గంటా రమేష్, గంటా మురళీ, గంటా సుబ్రహ్మణ్యం, గంటా రమణ, జొన్నకూటి మహేష్. ఉపాధ్యాయురాలు రేణుకా దేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంకిపాటి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం: వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 15 వాహనాలకు జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నందు ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇనెస్పెక్టర్ 96185 21855, సబ్ ఇన్‌స్పెక్టర్ 99634 63363 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కంభం విజయరాజు పరామర్శ



రేచర్ల గ్రామంలో సుధాకర్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కంభం విజయరాజు

చింతలపూడి: రేచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రొద్దుటూరి సుధాకర్‌రావు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు సోమవారం పరామర్శించారు. ఇటీవల సుధాకర్ సదరం సర్టిఫికెట్ కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. సుధాకర్ కుటుంబాన్ని విజయరాజు పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన యాదాల నరశింహారావు కుటుంబాన్ని కూడా విజయరాజు పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ కె శివరామకృష్ణ, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, ఎ సుబ్బారావు, రాజు, ప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లి గ్రామంలో పల్లపాటి జయరాజు భార్య సత్యవతి ఇటీవల మృతి చెందారు. రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత సోమవారం మృతురాలి ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సత్యవతి చిత్రపటం వద్ద ఆమె నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి అనీల్, చెలికాని సంజయ్, చెలికాని బుల్లియ్య, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, పానమాల ఉమామహేశ్వరరావు, గోపా నాగేశ్వరరావు, భోగరాజు సాయికృష్ణ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, దాసరి రాంబాబు తదితరులున్నారు.

ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీ

ద్వారకాతిరుమల: స్థానిక కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కొందరు వ్యాపారులకు, గృహ యజమానులకు పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. గృహ, దుకాణదారులు తమ వద్ద ఉన్న రికార్డులను చూపాలని, లేకుంటే తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకోవాలని ఫిర్యాదు

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్ పరిధిలో (భీమడోలులోని స్టేట్ బ్యాంకు ఎదురుగా) రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువ (వాగు)ను ఉదయగిరి త్రినాథ్ అనే వ్యక్తి పూడ్చి వేసి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడని భీమడోలుకు చెందిన ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి ముళ్ళగిరి జాన్సన్ సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వాగును పూడ్చడం వల్ల స్టేట్ బ్యాంక్ వెనుక కాలనీ, జంక్షన్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఎం.నాగులపల్లి పంచాయతీ కార్యదర్శిని కోరినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. వెంటనే ఈ అక్రమ కట్టడాన్ని నిలిపివేసి, మురుగు కాలువను పునరుద్ధరించేలా అధికారులను ఆదేశించాలని జాన్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు.